ఉచిత బస్సు ప్రయాణం హుళక్కే!

● బడ్జెట్లో కేటాయింపులు నిల్
● 1.29 లక్షల మహిళల ఆగ్రహం

యలమంచిలి: బ్యాంకులో కుదువపెట్టిన బంగారు వస్తువులు విడిపించవద్దని, వాటి రుణాన్ని రద్దు చేస్తానని, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి 2014లో అధికారంలోనికి వచ్చిన తరువాత చంద్రబాబు ఆ హామీలను అమలు చేయకుండా మహిళల్ని మోసం చేశారు. మళ్లీ 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని, 19 నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని ఆర్భాటంగా హామీ ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చి 9 నెలలవుతున్నా ఆ పథకాల ఊసే లేదు. అడపాదడపా ఒకరిద్దరు నేతలు త్వరలో.. త్వరలో అంటూ ప్రకటనలివ్వడమేగానీ ఆచరణలో అమలు కావడం లేదు. తీరా రాష్ట్ర బడ్జెట్లో కూడా వాటి ప్రస్తావన తీయలేదు. ఈ నేపథ్యంలో మహిళలు కూటమి సర్కార్పై చిర్రుబుర్రులాడుతున్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో కూలీలు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, కర్షకులు అధికం. నియోజకవర్గంలోని గ్రామాల నుంచి నిత్యం ఆస్పత్రులకు, కూలి పనులకు, కాలేజీలకు, చిరు వ్యాపారాలకు, వివిధ దుకాణాల్లో పని చేయడానికి మహిళలు పట్టణం వచ్చి వెళతుంటారు. బడ్జెట్లో ఉచిత బస్సు ప్రయాణం ఊసెత్తకపోవడంతో మహిళల ఆశలు అడియాశలయ్యాయి.

ఎదురుచూపు

పాలకొల్లు నియోజకవర్గంలో 1,28,914 మంది మహిళలు ఉన్నారు. వీరంతా ఉచిత బస్సు ప్రయాణ పథకానికి అర్హులు. నియోజకవర్గంలోని దాదాపు 40 శాతం గ్రామాలకు చెందిన రూట్లకు ఆర్టీసీ బస్సులు వెళ్తున్నాయి. ఆయా గ్రామాల నుంచి నిత్యం మహిళలు ప్రయాణాలు సాగించేందుకు ఉపయోగం ఉంటుంది.



ఆర్టీసీ బస్సులో మహిళలతో మాట్లాడుతున్న చంద్రబాబు (ఫైల్)

కసరత్తు పేరుతో కాలయాపన



ఉచిత బస్సు పథకం అమలు చేయాలి. పాలకొల్లు నియోజకవర్గం నుంచి జిల్లాలోని పలు గ్రామాలకు, పట్టణాలకు నిత్యం మహిళలు కూలి పనులకు, ఇతర వృత్తులకు వెళ్తుంటారు. విద్యార్థినులు నిత్యం ఆర్టీసీ బస్సుల్లో రాక పోకలు సాగిస్తుంటారు. వారందరికీ ఉచిత బస్సు పథకం వల్ల ఎంతో లబ్ధి చేకూరుతుంది. కూటమి సర్కార్ కసరత్తు పేరుతో కాలయాపన చేస్తోంది. తక్షణమే మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయాలి. – కర్రా జయసరిత, న్యాయవాది

మాట నిలబెట్టుకోవాలి



అధికారం కోసం అమలుకాని హామీలివ్వడం.. ఆతరువాత హామీలను అటకెక్కించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ హామీని నిలబెట్టుకోవాలి. అధికారంలోకొచ్చి తొమ్మిది నెలలు దాటినా.. ఎప్పటి నుంచి అమలు చేస్తారనేదీ చెప్పడంలేదు. ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత బస్సు పథకాన్ని అమలు చేశారు. మన రాష్ట్రంలో ఎగనామం పెట్టే ప్రయత్నాలు చేయడం బాధాకరం. – రావూరి వెంకటరమణ, మాజీ ఎంపీపీ, యలమంచిలి

క్లుప్తంగా

15 మంది గైర్హాజరు



పెనుగొండలో పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

పెనుగొండ: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు సోమవారం 15 మంది గైర్హాజరయినట్టు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కొల్లి వెంకట రామ సూర్యానారాయణ తెలిపారు. తెలుగు, సంస్కృతం, ఒకేషనల్ ఫౌండేషన్ పరీక్షలు జరిగాయన్నారు. జనరల్ విభాగంలో 261 మందికి 8 మంది, ఒకేషనల్ విభాగంలో 319కి ఏడుగురు గైర్హాజరయినట్టు వివరించారు.

● ఆచంట ఎంవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు ముగ్గురు గైర్హాజరయ్యారు. 58 మందికి 55 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఇంటర్ పరీక్షకు ఐదుగురు గైర్హాజరు

ఉండి: మండలంలోని యండగండి జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రంలో సెకండియర్ పబ్లిక్ పరీక్షల ప్రారంభ సందర్భంగా సోమవారం జరిగిన సంస్కృతం, తెలుగు పరీక్షకు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎగ్జామ్స్ చీఫ్ సూపరింటెండెంట్ ఎన్.రమాప్రియ తెలిపారు. పరీక్షా కేంద్రంలో మొత్తం 246 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 241 మంది మాత్రమే పరీక్షకు హాజరైనట్లు ఆమె తెలిపారు.

మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత



ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎస్పీ జయసూర్య

భీమవరం (ప్రకాశంచౌక్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా సాధికార వారోత్సవాల్లో భాగంగా సోమవారం మూడో రోజు విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మహిళా భద్రతే ప్రాధాన్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని డీఎస్పీ ఆర్జీ జయసూర్య తెలిపారు. మహిళా సంబంధిత చట్టాలు, సైబర్ క్రైమ్, పోక్సో, గుడ్ అండ్ బ్యాడ్ టచ్, బాల కార్మిక చట్టాలు, మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలు, ఆకతాయిల వేధింపులు, ర్యాగింగ్ నుంచి రక్షణ, సామాజిక మాధ్యమాల వినియోగం వంటి పలు మహిళా సంబంధిత నేరాలపై ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

అనుబంధ సంఘాల డెలిగేట్గా సుందర్రావు

కాళ్ల: ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ చర్చ్, పశ్చిమగోదావరి జిల్లా జక్కరం ప్యారిస్ అనుబంధ సంఘాల డెలిగేట్ ఎన్నికలు సోమవారం నిర్వహించారు. జక్కరం ప్యారిస్ హెడ్ క్వార్టర్ సెయింట్ జాన్ లూథరన్ దేవాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డెలిగేట్ ఎన్నికలు నిర్వహించారు. జక్కరం పెదవేట లూథరన్ చర్చికి చెందిన చిలకపాటి సుందర్రావు డెలిగేట్గా బొండాడ చిన్న పేట సంఘానికి చెందిన దొండపాటి రవిచంద్రన్ ఆల్టర్నేటివ్ డెలిగేట్గా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక ప్రక్రియ ప్యారిస్ పాస్టర్ జీడీ కరుణాకర్ ఆధ్వర్యంలో ఎలక్షన్ అబ్జర్వర్గా ప్రకాష్వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో జక్కరం ప్యారిస్లోని అన్ని సంఘాల పీసీసీలు తమ ఓటు హక్కును వినియోగించుకుని చిలకపాటి సుందర్రావును గెలిపించారు. ఈయన జక్కరం ప్యారిస్ డెలిగేట్గా ఎన్నికగావడం వరుసగా ఇది మూడోసారి. కార్యక్రమంలో పాము సత్యం, దొండపాటి చంద్రశేఖర్, సిరింగి బాల, కందిగట్ల సామ్యూల్, ఈది డైమండ్ రాజ్, దుండి లాజర్, మంగొ ఆనంద్ కుమార్, పోతురాజు సత్యానందం, మద్ద చిట్టిబాబు పీసీసీ సభ్యులు పాల్గొన్నారు.

వినికిడి లోపం రాకుండా జాగ్రత్తలు పాటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భీమవరం (ప్రకాశంచౌక్): వినికిడి లోపం రాకుండా జాగ్రత్తలు పాటించాలని పలువురు వైద్యులు తెలిపారు. ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా భీమవరం ఏరియా ఆసుపత్రిలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి బానునాయక్ మాట్లాడుతూ చెవిలో నొప్పి, సంభాషణలను అనుసరించలేకపోవడం, శబ్దాలను వినలేకపోవడం, టీవీలో సౌండ్ను పెంచి వినడం తదితరవన్నీ వినికిడి లోపానికి సంకేతాలన్నారు. 60 ఏళ్లు పైబడిన వారిలో 33 శాతం మందిలో చెవుడు సమస్య కనిపిస్తుండగా, 74 ఏళ్ల వయసులో ఈ సంఖ్య 50 శాతానికి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మాధవి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్క్రీన్ ప్రింటింగ్పై శిక్షణ



స్క్రీన్ ప్రింటింగ్పై శిక్షణ ఇస్తున్న నిర్వాహకురాలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా సాధికార సంక్షేమ శాఖ, ఐక్యుఏసీ, కామర్స్ విభాగం ఆధ్వర్యంలో శ్రీ గురు శారీ స్క్రీన్ ప్రింటింగ్ పాలకొల్లు వారి సహకారంతో రెండు రోజుల ట్రెనింగ్ సెంటర్ను ప్రారంభించామని ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. మహిళలు వివిధ రంగాల్లో అవగాహన కల్పించుకోవడం వల్ల కుటుంబ పోషణకు ఆర్థికంగా కొంత సహకారం అందించుకోవచ్చని ఆమె అన్నారు. నిర్వాహకులు మాదవి, జ్యోతిలు మహిళలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, మణిమాల తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



పాలకొల్లు సెంట్రల్: ర్యాలీలో పాల్గొన్న సీఐ, సీడీపీఓ, అంగన్వాడీలు



యలమంచిలి: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

పాలకొల్లు సెంట్రల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లలు పుట్టాలి, బతకాలి, చదవాలి, వారి రక్షణకు అందరూ సంసిద్ధులు కావాలంటూ నినదించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ కె.రజనీకుమార్ మాట్లాడుతూ బాల్య వివాహ రహిత సమాజస్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఆడపిల్లలు ఇంటికి వెలుగు దీపాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ సీఎచ్ ఇందిర, ఎస్సై జీజే ప్రసాద్, పసుపులేటి దుర్గ, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పి.సత్యవాణి, కె.మల్లేశ్వరి, ఎస్ మంగ, వినయ్ భూషణ్, పాలకొల్లు పట్టణ, రూరల్ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీల కొవ్వొత్తుల ర్యాలీ

యలమంచిలి: ఈ నెల ఒకటి నుంచి ఏడో తేదీ వరకు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఐసీడీఎస్ సూపర్వైజర్ మహ్మద్ హసీనా తెలిపారు. వారోత్సవాలలో భాగంగా సోమవారం యలమంచిలి, మేడపాడు, దొడ్డిపట్ల క్లస్టర్స్ పరిధిలో బాల్య వివాహాలను అరికట్టాలని కోరుతూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత, డ్వాక్రా, విద్య, పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వద్దు



సచివాలయాల సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

నరసాపురం: పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పేర్కొన్నారు. సోమవారం ఆయన పలు వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. సచివాలయాల సిబ్బందితో సమీక్షించారు. సిబ్బంది ఖచ్చితంగా సమయానికి విధులకు హాజరుకావాలన్నారు. ప్రతి ఇంటి వద్దా చెత్త సేకరించాలని చెప్పారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు.

పశువులు వదిలితే చర్యలు

రోడ్లపైకి పశువులను వదిలితే చర్యలు తీసుకుంటామని కమిషనర్ అంజయ్య హెచ్చరించారు. స్థానిక మార్కెట్ ప్రాంతంలో పశువులు విచ్చలవిడిగా సంచరించడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. యజమానులు తమ పశువులను కట్టడి చేసుకోవాలని మైక్ ప్రచారం చేశామన్నారు. మాట వినకపోతే పోలీసుల సహకారంతో చర్యలు చేపడతామని హెచ్చరించారు.

● 5 కేజీల మారేడు



మారేడు కాయతో శిరీష

పరమేశ్వరుడికి ప్రీతి అయినవిగా చెప్పుకొనే మారేడు దళాలు, కాయల గురించి తెలియని భక్తులు ఉండరంటే అతిశయోక్తి కాదు. సాధారణంగా మారేడు కాయలు బత్తాయి సైజులో ఉంటాయి. కానీ పాలకొల్లు చినగోపురం రోడ్డులో నివసిస్తున్న బంగారు శిరీష పెరట్లోని మారేడు చెట్టుకు మాత్రం 5 కేజీలు, 3 కేజీల సైజు గల కాయలు కాయడం విశేషం. పిచ్చి మొక్కలను తొలగించే క్రమంలో ఆకుల చాటున ఉన్న కాయలు కనిపించాయని, వాటి బరువు తాము ఎప్పుడూ చూడని సైజులో ఉండటం ఆశ్చర్యం కలిగించిందని శిరీష తెలిపారు. దీనిపై తణుకు ఉద్యాన అధికారిణి కె.ప్రియదర్శిని మాట్లాడుతూ అన్ని పోషకాలూ అందితే మారేడు కాయలు చిన్న సైజు పనసకాయ అంత కూడా పెరుగుతాయని చెప్పారు. అది బాగా అరుదుగానే జరుగుతుందని తెలిపారు. – పాలకొల్లు సెంట్రల్

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ బలరామరాజు

భీమవరం (ప్రకాశంచౌక్): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ బలరామరాజు తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ×డ్రగ్స్ రహిత సమాజం యువత పాత్ర అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. యువత ఉన్నత లక్ష్యాన్ని నిర్ధేశించుకొని సమాజ ప్రగతికి పాటుపడాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి కే జె ప్రసూన మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల మనిషి నాడీ మండలం బలహీనమై నిర్వీర్యుడు అవుతాడని, అమాయకత్వంగా నమ్మి వ్యసనాలలో పడకుండా ఉత్తమ జీవిత శైలిని అలవర్చుకోవాలని సూచించారు.ఈ అంశంపై జరిపిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు, ఔ. నరసింహారావు, జి. ఉమామహేశ్వరి, పి అమూల్యరావు, జి ప్రసాద్ బాబు, జి కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చినకాపవరంలో అన్నసమారాధన



అన్న ప్రసాదం వడ్డిస్తున్న భక్తులు

ఆకివీడు: మహా శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారికి అఖండ అన్నసమారాధన నిర్వహించినట్లు వైఎస్సార్సీపీ నాయకురాలు, ఆలయ చైర్మన్ నందమూరి సత్యవతి చెప్పారు. మండలంలోని చినకాపవరం గ్రామంలో వెంకయ్య వయ్యేరు గట్టుపై వెలసిన సోమేశ్వరస్వామి ఎంతో మహిమ కలిగినవారని ఆమె చెప్పారు. గ్రామంలోని మహిళలు మహాశివరాత్రి రోజు ప్రత్యేక పూజలు చేసి, అభిషేకాలు నిర్వహించారన్నారు. సోమవారం అఖండ అన్నసమారాధనలో 1200 మంది భక్తులు పాల్గొన్నారని ఆమె తెలిపారు. నందమూరి ఈశ్వర ప్రసాద్, గాజుల వెంకటేశ్వరరావు, సత్తినీడి గంగాధరరావు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం వైఎస్సార్ చలవే



వైద్య శిబిరాన్ని సందర్శించిన వైఎస్సార్ సీపీ ఇన్చార్జి గోపి

యలమంచిలి: గ్రామీణ పేదలకు కూడా కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందుతుందంటే అది దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చలవేనని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. యలమంచిలి మండలం కట్టుపాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు మామిడిశెట్టి చిట్టిబాబు ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పార్టీ మహిళా రాష్ట్ర సహాయ కార్యదర్శి కర్రా జయసరితతో కలిసి ఆయన ప్రారంభించారు. 2005వ సంవత్సరంలో రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టడంతో ఈ 20 ఏళ్లలో కొన్ని లక్షల మంది ప్రజలు ఉచితంగా నాణ్యమైన వైద్యం పొందగలుగుతున్నారని వివరించారు. శిబిరంలో విజయవాడకు చెందిన పీవీఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు పి.వెంకటరామ్ (ఆర్థోపెడిక్), సందీప్ (కార్డియాలజీ), హర్షిత (ఎండీ), మహిమ (జనరల్ మెడిసన్)లు గుండె, సాధారణ రోగులు 118 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 62 మందికి ఈసీజీ, 2 డీ ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. మందులు అందజేశారు. 25 మందిని మెరుగైన వైద్యం కోసం విజయవాడకు సిఫారసు చేశారు. శిబిరం నిర్వహణకు పవన్కుమార్, సుభద్రలు సహకారం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పొన్నమండ నాగరాజు, పార్టీ నాయకులు పొన్నమండ ముత్యాలరావు, నక్కవరపు సత్యనారాయణ, పూరిళ్ల మాణిక్యాలరావు, పెచ్చెటి రాంబాబు, జోగాడ ఉమామహేశ్వరరావు, జోగి వెంకటేశ్వరరావు, గుడాల సురేష్, కళ్యాణం గంగాధరరావు, కెల్లా పెద్దిరాజు, పసుపులేటి కుమారి తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి పూర్వపు వైభవం తీసుకొద్దాం



ముదునూరికి పూలబొకే అందిస్తున్న లీగల్సెల్ అధ్యక్షుడు విన్నా ప్రకాష్, న్యాయవాదులు



ముదునూరికి కృతజ్ఞతలు చెపుతున్న బూత్ కమిటీల వింగ్ అధ్యక్షుడు కావలి నాని, నాయకులు

జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు

నరసాపురం: పార్టీ పటిష్టత, పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కష్టపడి పనిచేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు సూచించారు. పార్టీ నియోజకవర్గ లీగల్సెల్ అధ్యక్షుడిగా నియమితులైన విన్నా ప్రకాష్ నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ, కామన బుజ్జి, నల్లిమిల్లి జోసఫ్, రంపా పుల్లాజీ, ఇంజేటి జాన్ కెనడీ, దేవ రంజిత్కుమార్, సైమన్ తదితరులతో కలిసి సోమవారం ప్రసాదరాజును పార్టీ కార్యాలయానికి వచ్చారు. ప్రసాదరాజుకు పూల బొకే అందించి కృతజ్ఞతలు చెప్పారు. పార్టీ బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడుగా నియమితులైన కావలి నాని సతీమణి కౌన్సిలర్ రామసీతతో కలసి పూలబొకే అందించి కృతజ్ఞతలు తెలిపారు. కల్చరల్ వింగ్ అధ్యక్షుడుగా నియమితులైన కడిలి పెద్దిరాజు, బీసీసెల్ వింగ్ అధ్యక్షుడుగా నియమితులైన పతివాడ మార్కెండేయులు అనుచరులతో వచ్చి ప్రసాదరాజును కలిశారు. పదవులు పొందిన నాయకులను ప్రసాదరాజు అభినందించారు. పార్టీ అప్పగించిన పదవులు బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. ముదునూరితో పాటు పార్టీ కేంద్రపాలక మండలి సభ్యుడు పీడీ రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బర్రి శంకరం, తదితరులు ఉన్నారు.

రైతుబాంధవుడు వీణం వీరన్న



వీరన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్రంలో, ఉభయగోదావరి జిల్లాల రైతులకు ఎనలేని సేవలందించి వారి హృదయాల్లో నిలిచిన తొలి తెలుగు ఇంజనీరు వీణం వీరన్న ఏపీ రైతు కార్యాచరణ సమితి అధ్యక్షుడు పాతపాటి మురళీ రామరాజు తెలిపారు. భీమవరం ఆరద్యనగర్లో వీణం వీరన్న జయంతి సందర్భంగా వీరన్న, కాటన్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మురళీ రామరాజు మాట్లాడుతూ సర్ ఆర్థర్ కాటన్కు కుడిభుజంగా ఉన్న వీరన్న తొలి తెలుగు ఇంజనీరు అని కొనియాడారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన వీరన్న నీటిపారుదల శాఖలో ఉద్యోగిగా చేసి, కాటన్దొరకు సహాయకుడిగా ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణంలో విశేష సేవలందించిన వీణం వీరన్న రైతుల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. కలిదిండి గోపాల కృష్ణం రాజు, నల్లం నాగేశ్వరరావు, మంతెన కృష్ణంరాజు, భూపతిరాజు సత్యనారాయణ రాజు, ఎం.ఎస్. ఎన్.రాజు, డి.లక్ష్మీపతిరాజు, గోపిశెట్టి మురళీకృష్ణారావు పాల్గొన్నారు.

ట్యాంకుల క్లీనింగ్పై అవగాహన



సెప్టింక్ ట్యాంకల క్లీనింగ్పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: సెప్టిక్ ట్యాంకులను సెప్టిక్ క్లీనింగ్ వాహనాల ద్వారా మాత్రమే క్లీనింగ్ చేయించుకోవాలని, మ్యాన్హోల్ ద్వారా క్లీనింగ్ చేయకూడదని మునిసిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ రాజు అన్నారు. సోమవారం పట్టణంలో నమస్తే ప్రోగ్రాం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. సెప్టిక్ ట్యాంకులు ప్రతి మూడేళ్లకు ఒకసారి క్లీనింగ్ చేయించుకోవాలని సూచించారు. ఈ సెప్టిక్ ట్యాంకులు క్లీనింగ్ చేసే కార్మికులు తప్పనిసరిగా నమస్తే ప్రోగ్రాం ద్వారా తమ పేర్లు నమోద చేయించుకోవాలన్నారు. పేర్లు నమోదు చేయించుకున్న సభ్యులకు ఇన్సూరెన్స్, ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్ అందుతాయని వివరించారు.

8న జాతీయ లోక్ అదాలత్



జడ్జి జియాద్దీన్

పాలకొల్లు సెంట్రల్: జాతీయ లోక్ అదాలత్ మార్చి 8న నిర్వహించనున్నట్టు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) షేక్ జియాద్దీన్ తెలిపారు. సోమవారం ఆయన కోర్టు ప్రాంగణంలో మాట్లాడుతూ కేసులు రాజీ వల్ల సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చన్నారు. రాజీ యోగ్యమైన కేసులు సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. చెక్ బౌన్స్, మనోవర్తి, గృహ హింస, కుటుంబ తగాదాలు, బ్యాంక్లు, ప్రామిసరీ నోట్ వంటి అన్ని సివిల్ కేసులు రాజీ చేసుకోవచ్చని తెలిపారు. సివిల్ కేసులు రాజీ చేసుకోవడం వల్ల అప్పటి వరకు కట్టిన కోర్టు ఫీజులు వాపసు ఇస్తారని వివరించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

వీరవాసరం: రాయకుదురులో అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సోమవారం పలువురు ఆర్థిక చేయూత అందించారు. ఎంపీపీ వీరవల్లి దుర్గ భవానీ, సర్పంచ్ గెడ్డం భారతి దుస్తులు, నిత్యావసర సరుకులను అందజేశారు. భీమవరంకు చెందిన యునైటెడ్ సర్వీసెస్ ఆఫ్ వనిత కాపు క్లబ్ ఆధ్వర్యంలో వంట సామగ్రి, దుస్తులను అందజేశారు. వైస్ ఎంపీపీ అడ్డాల రామకృష్ణ, జవ్వాది దాశరధి శ్రీనివాస్, తోట విజయ్ కుమార్ పాల్గొన్నారు.